
సాక్షి
కుమురం భీం

మంగళవారం । 7 । నవంబర్ । 2023



ఓట్లే.. సీట్లు లేవు!
ఇటీవల అన్నిపార్టీలు ప్రకటించిన అభ్యర్థుల్లో ఎక్కడ కూడా కార్మికవర్గానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. దీనిపై సింగరేణిలో తీవ్ర చర్చ జరుగుతోంది.
IIలో▸



గుట్టుగా 'బెల్టు' దందా..!
కాగజ్‌నగర్ మండలంలో కొందరు గుట్టుగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారు. తనిఖీలు నిర్వహిస్తున్నా విక్రయాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు.
IIIలో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.4 /22.2
వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశంలో అక్కడక్కడ మేఘాలు ఉంటాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా అరుణ్‌కుమార్



నియామక పత్రం అందుకుంటున్న అరుణ్

ఆసిఫాబాద్‌అర్బన్: భారతీయ జనతా యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా అరుణ్‌కుమార్ నియమితులయ్యారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాశ్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అరుణ్‌కుమార్‌కు జిల్లా అధ్యక్షుడు యేలగతి సుచిత్ నియామక పత్రం అందించారు. అనంతరం అరుణ్‌కుమార్ మాట్లాడుతూ అంకిత భావంతో పార్టీ బలోపేతానికి కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కృషి చేస్తానని పేర్కొన్నారు.

'పాల్వాయి' తరఫున నామినేషన్



సిర్పూర్-టిలో నామినేషన్ దాఖలు చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్/సిర్పూర్(టి): ఆసిఫాబాద్ నియోజకవర్గంలో సోమవారం నామినేషన్లు దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారి దాసరి వేణు తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గంలో ఒక నామినేషన్ వచ్చినట్లు రిటర్నింగ్ అధికారి దీపక్ తివారి తెలిపారు. పాల్వాయి హరీశ్ బాబు తరఫున సిర్పూర్(టి) జెడ్పీటీసీ నీరటి రేఖ, బీజేపీ మండల అధ్యక్షుడు ఎల్ములే శంకర్ మండల కేందరంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. వారి వెంట గ్రంథాలయ శాఖ డైరెక్టర్ నీరటి సత్యనారాయణ, తిరుపతిరావు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా



మాట్లాడుతున్న లోకేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లోకేశ్ డిమాండ్ చేశారు. వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని కంపెనీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల వేతనాలు ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని మండిపడ్డారు. కార్మికులు దసరా, దీపావళి పండుగలకు పస్తులుంటున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి పండుగలను దృష్టిలో ఉంచుకుని వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, బాలేశ్, సురేశ్, ప్రభాకర్, పురుషోత్తం, భాస్కర్, వేణు, గౌతమ్, జంగు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీకి సున్నం వేసిన విద్యార్థులు!

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో సోమవారం సాయంత్రం ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు ప్రహరీకి సున్నం వేయడం చర్చనీయాంశంగా మారింది. ప్యానల్ ఇన్‌స్పెక్షన్ ఉన్న కారణంగా పాఠశాల ముందు భాగంలోని గోడలపై అందమైన బొమ్మలు వేయాలని ఉపాధ్యాయులు భావించారు. సున్నం వేసే పనులు కూలీలతో చేయించాల్సి ఉండగా సోమవారం సాయంత్రం ఉపాధ్యాయులు, విద్యార్థులు గోడలకు సున్నం వేశారు. ఇలాంటి పనులు విద్యార్థులతో చేయించడం ఏంటని విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ జ్యోతిని వివరణ కోరగా.. ప్యానల్ ఇన్‌స్పెక్షన్ ఉండటంతో గోడలపై బొమ్మలు వేయాలని నిర్ణయించాం. ఉపాధ్యాయులందరం వైట్ వాష్ చేస్తుండగా విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పనుల్లో భాగస్వామ్యం అయ్యారని తెలిపారు. విద్యార్థులకు పాఠశాలలో ఎలాంటి పనులు పురమాయించలేదని ఆమె స్పష్టం చేశారు.

నిర్భయంగా ఓటు వేసేలా చర్యలు



- ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే మా ప్రథమ కర్తవ్యం
- పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు
- 'సాక్షి'తో ఎస్పీ కె.సురేశ్‌కుమార్



ఎస్పీ కె.సురేశ్‌కుమార్

సాక్షి, ఆసిఫాబాద్: 'ఓటర్లు నిర్భయంగా తమ ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నాం. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి.. గొడవలు జరగకుండా దృష్టి సారిస్తాం. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే మా ప్రథమ కర్తవ్యం. అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతాం. సామాజిక మాధ్యమాలపై ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించింది.' అని ఎస్పీ కె.సురేశ్‌కుమార్ చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీతో సోమవారం 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ నిర్వహించింది. వివరాలు ఆయన మాటల్లోనే..

శాంతిభద్రతలు కాపాడేందుకు..

ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోలీసుశాఖ పరంగా చర్యలు తీసుకుంటున్నాం. రౌడీషీటర్లు, హిస్టరీ షీట్స్ అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టాం. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటివరకు 363 కేసులు నమోదు చేసి 2,403 మంది అనుమానితులను బైండోవర్ చేశాం. వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంటుంది. 15 మందికి ఆయుధాల లైసెన్సులు ఉండగా 12 మంది డిపాజిట్ చేశారు. మిగిలినవి బ్యాంకుల బందోబస్తు నిర్వహించే వారి వద్ద ఉన్నాయి.

నిఘా కట్టుదిట్టం

జిల్లాలో అక్రమంగా మద్యం, నగదు ప్రవాహానికి అడ్డుకట్ట వేశాం. ఇందుకోసం 4 అంతర్రాష్ట్ర, 3 అంతర్ జిల్లాల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘా కట్టుదిట్టం చేశాం. వచ్చి పోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నాం. వీడియో సర్వైలెన్స్ బృందాలతో తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకు రూ.2 కోట్ల నగదు పట్టుకున్నాం. రూ.7.17 లక్షల విలువైన 1,266 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశాం.

తాయిలాలకు అడ్డుకట్ట

ఓటర్లను మభ్యపెట్టే విధంగా ఎవరు యత్నించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా తాయిలాలకు అడ్డుకట్ట వేస్తున్నాం. జిల్లా ఎన్నికల అధికారి నేతృత్వంలో ఎన్నికల నియమావళి(మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్)ని పటిష్టంగా అమలు చేస్తున్నాం. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ (ఎఫ్ఎస్‌టీ), స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ (ఎస్ఎస్‌టీ)లు పనిచేస్తున్నాయి. అందులో పోలీసులు కూడా విధులు నిర్వహిస్తూ జిల్లాలో విస్తృతంగా వాహనాల తనిఖీలు చేస్తున్నారు.

పటిష్ట భద్రతా ఏర్పాట్లు

జిల్లాలో మొత్తం 597 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 92 సమస్యాత్మక, 72 ఎల్‌డబ్ల్యూఈ(లెఫ్ట్ వింగ్ ఎక్స్‌ట్రీమిస్ట్) కేంద్రాలుగా గుర్తించాం. ప్రధానంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు.. జిల్లా, మండల కేంద్రాల్లో కేంద్ర పారామిలిటరీ బలగాలు, స్థానిక పోలీసులతో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశాం. ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించడం ద్వారా ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా నిర్భయంగా ఓటు వేసేలా భరోసా ఇస్తున్నాం.

చెక్ పోస్టులు : 7 (అంతర్రాష్ట్ర 4, అంతర్ జిల్లా 3)
బైండోవర్లు : 2,403 మంది(363 కేసులు)
పట్టుకున్న మద్యం : 1,266 లీటర్లు
పట్టుకున్న నగదు : రూ.2 కోట్లు
గంజాయి : 468 మొక్కలు

ప్రశాంత ఎన్నికల కోసం..

జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాం. జిల్లా ఎన్నికల అధికారి పర్యవేక్షణలో రెవెన్యూ, పోలీసులు సమన్వయంతో పనిచేస్తున్నారు. ఈ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు మేం సిద్ధంగా ఉన్నాం.

సోషల్ మీడియాతో అప్రమత్తం..

సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టేలా పెట్టే పోస్టులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వాట్సాప్ గ్రూపుల అడ్మిన్లు తప్పుడు వార్తలు, ఎదుటి వ్యక్తుల మనోభావాలు దెబ్బతినేలా ఇష్టారీతిన పోస్టులు పెడితే చర్యలు తప్పవు. సోషల్ మీడియా గ్రూపులపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

ఆసిఫాబాద్: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆర్డీవో కదం సురేశ్‌తో కలిసి శాసనసభ ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్, సిర్పూర్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రచార సభలు, ర్యాలీలు, సమావేశాలు, వాహనాలు, ప్రకటనల కోసం తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. ఐదు కిలోమీటర్లకు దూరంగా ఉన్న ఓటర్ల కోసం అదనపు పోలింగ్ కేంద్రాల నిర్వహణకు చర్యలు తీసుకుంటామన్నారు. తిర్యాణి మండలం మందగూడ పోలింగ్ కేంద్రం నుంచి బుగ్గగూడ, భీంజీగూడ, తాటి మాదర హ్యాబిటేషన్లతో కలిసి బుగ్గగూడ వద్ద పోలింగ్ కేంద్రం ఏర్పాటు, సిర్పూర్‌- టి మండలం లోని హుడ్కిలి పోలింగ్ కేంద్రం నుంచి ఇటిక్యాల పహాడ్ గ్రామాన్ని తొలగించి ఇటిక్యాల్‌పహాడ్ గ్రామంలో అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు ఎన్నికల నియమావళికి లోబడి ఉండాలని, నామినేషన్ స్వీకరణ కేంద్రానికి 100 మీటర్ల లోపు ర్యాలీకి అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థితో కలిపి ఐదుగురు మాత్రమే లోపలికి వెళ్లాలని సూచించారు. మూడు వాహనాలు అనుమతి ఉంటుందని తెలిపారు. ఒక్కో అభ్యర్థి 4 సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చని, అత్యధికంగా రెండు ప్రాంతాల్లో పోటీ చేయవచ్చని తెలిపారు. సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు సీఎం పర్యటన



జిల్లాకేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 8న ఆసిఫాబాద్ నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ పర్యటించనున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ పక్కన ప్రజాఆశీర్వాద సభ ఏర్పాట్లను సోమవారం బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు పరిశీలించారు.

బెజ్జూర్: కాగజ్‌నగర్ పట్టణానికి ఈ నెల 8న సీఎం కేసీఆర్ రానున్నారని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తెలిపారు. బెజ్జూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

కలిసిరాని కాలం!



రెబ్బెన మండలం నంబాల శివారులో పత్తి పంట పరిస్థితి

- వర్షాభావ పరిస్థితులతో వాడిపోతున్న పత్తి మొక్కలు
- రాలుతున్న పూతకాత..
- పెరిగిన పెట్టుబడులతో రైతులు కుదేలు
- గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని వేడుకోలు

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లాలో అత్యధికంగా పత్తిని సాగు చేసే రైతులకు ఈసారి కాలం కలిసిరానట్లే కనిపిస్తోంది. పంట చేతికందే దశలో ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితులు పత్తి రైతులను కుంగదీస్తున్నాయి. సీజన్ మధ్యలో ఏకధాటిగా 29 రోజుల పాటు ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల కారణంగా పత్తిలో ఆశించిన స్థాయిలో పెరుగుదల లేక కాత, పూత అంతంత మాత్రంగా వచ్చాయి. గత సంవత్సరంతో పోల్చితే ఈ సీజన్‌లో నెలరోజుల ముందే నిలిచిపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. పత్తి కాయలు పడే దశలోనే వర్షాలు ముఖం చాటేయడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. గతేడాది అధిక వర్షాలతో పంటలు దెబ్బతిని తీవ్రనష్టాలను చవిచూసిన వారిని ఈసారి వర్షాభావ పరిస్థితులు దెబ్బతీశాయి. ప్రస్తుతం చెట్టుకు 30కి మించి కాయలు లేకపోవడంతో పెట్టుబడి కూడా వస్తుందో.. రాదో.. అని ఆందోళన చెందుతున్నారు.

వాడిపోతున్న మొక్కలు..
జిల్లాలోని 15 మండలాల పరిధిలో వానాకాలంలో సుమారు 4.5 లక్షల ఎకరాల పంటలు సాగు చేయగా, అందులో అత్యధికంగా 3.39లక్షల ఎకరాల్లో పత్తి పంటే వేశారు. గత సంవత్సరం అధిక వర్షాలతో పత్తిలో దిగుబడి తగ్గిపోగా తీవ్ర నష్టం ఏర్పడింది. కనీసం ఈ సంవత్సరమైనా వాతావరణం కరుణించకపోదా అని కోటి ఆశలతో పంటలు సాగు చేశారు. ఈ ఏడాది కూడా కాలం కలిసిరాకుండా పోయింది. జిల్లాలో ఎకరానికి సగటు దిగుబడి సుమారు 6 నుంచి 8 క్వింటాళ్లు ఉంటుంది. ఈసారి సీజన్ మధ్య, పంట చేతికందే దశలో ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితుల మూలంగా మొక్కల ఎదుగుదల దెబ్బతింది. ప్రస్తుతం మొదటి దశ పత్తి ఏరేందుకు సిద్ధంగా చేలు ఉన్నాయి. ప్రారంభంలో పడిన పత్తి కాయలే తప్పా కొత్తగా కాయలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నెలన్నర రోజులుగా వర్షాలు పూర్తిగా లేక పూతలు పూర్తిగా రాలిపోయాయి. తేలికపాటి భూములు, ఎర్రనేలల్లో తేమ లేక పత్తి మొక్కలు ఎండలకు వాడిపోతున్నాయి. కొన్ని రోజులుగా పెరిగిన పగటి ఉష్ణోగ్రతలతో పత్తిలో పూతలు పూర్తిగా రాలిపోతూ మొక్కలు మాత్రమే మిగిలాయి. జిల్లాలో ఎకరానికి సగటున 4 క్వింటాళ్ల దిగుబడి వచ్చేలా కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు.

> **ఎండలకు వాడిపోతున్నాయి**
> నెలన్నర రోజులుగా వర్షాలు లేకపోవడం పత్తిపంట దిగుబడిపై ప్రభావం పడుతోంది. ఈ మధ్య కాలంలో ఒక్క వర్షం పడినా పంటకు మేలు జరిగేది. వర్షాభావ పరిస్థితులతో ఈసారి ఎకరానికి రెండు నుంచి మూడు క్వింటాళ్ల వరకు దిగుబడి తగ్గే అవకాశం ఉంది. పగటి ఉష్ణోగ్రతలు కూడా పెరుగుతుండటంతో తేలికపాటి, నీటి నిల్వ తక్కువగా ఉండే భూముల్లో మొక్కలు వాడిపోతున్నాయి. పూత పూర్తిగా రాలిపోతుంది.
> – శ్రీనివాస్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

ధరపైనే ఆశలన్నీ..
వర్షాభావ పరిస్థితులు పత్తి పంటను తీవ్రంగా దెబ్బతీస్తుండటంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. దీంతో రైతులు ఆశలన్నీ పత్తి ధరపైనే పెట్టుకున్నారు. రెండేళ్ల క్రితం పత్తికి ఊహించని రీతిలో క్వింటాలుకు రూ.11వేల వరకు పలికింది. గతేడాది ధరలు రైతులకు నిరాశే మిగిల్చాయి. కనీసం ఈసారైనా పత్తి ధరలు ఆశించిన స్థాయిలో ఉండాలని కోరుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో అక్కడక్కడ పత్తి ఏరే పనులు ప్రారంభం కాగా మరో 15 రోజుల్లో జిల్లా అంతటా జోరందుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ మద్దతు ధర రూ.7,020 ఉంది. ఆదిలాబాద్ మార్కెట్‌లో ఇటీవలే పత్తి కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కాగా మొదటి రోజు ప్రైవేటు వ్యాపారులు క్వింటాలుకు రూ.7,200 చెల్లించారు. సీజన్ మొదట్లో ఆశించిన స్థాయిలో ధర లేకపోవడం రైతులను కాస్త నిరాశకు గురిచేసింది. పత్తి మార్కెట్‌కు వచ్చే సమయానికి ధర మరింత పెరిగే అవకాశం ఉంటుందని వ్యాపారులు అంటున్నారు. విదేశాలకు చేసే ఎగుమతిపై పత్తి ధర ఆధారపడి ఉంటుందని, గతేడాది ఎగుమతులు లేకపోవటంతోనే ఆశించిన స్థాయిలో ధర లేకుండా పోయిందని వారు స్పష్టం చేశారు. పెరిగిన విత్తనాలు, ఎరువులు, కూలీలు, అరకల ధరలతో పెట్టుబడి పెరిగింది. తొలకరి జల్లులకు విత్తనాలు సరిగా మొలకెత్తకపోవటంతో రెండు, మూడుసార్లు విత్తుకోవాల్సి వచ్చింది. సీజన్ మధ్యలో 29 రోజులపాటు వర్షాలు ముఖం చాటేయడంతో తెగుళ్లు విజృంభించాయి. రసాయన మందుల భారం రైతులపైనే పడింది. రైతులకు గిట్టుబాటు అయ్యేలా క్వింటాల్‌కు రూ.10వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్
- పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం

ఆసిఫాబాద్: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు పోలీసు అధికారులు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. ఈ నెల 30న జరగనున్న ఎన్నికల్లో పోలీసు అధికారులు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై జిల్లా కేంద్రంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలను అమలు చేయాలని అన్నారు. కోడ్ అమలులో ఉన్నందున ఎట్టిపరిస్థితుల్లో రాజకీయ నాయకులకు సెల్యూట్ వంటివి చేయొద్దని, ఈసీఐ విధివిధానాలు మాత్రమే పాటించాలన్నారు. వీఐపీలు, వీవీఐపీలు, స్టార్ క్యాంపెనర్ల భద్రత అంశాలు, అవలంబించాల్సిన పద్ధతులను వివరించారు. ఎన్నికలు జరిగే రోజు, ముందు రోజు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన ఉండాలన్నారు. గ్రామాల్లో సమస్యలు సృష్టించే వారిని బైండోవర్ చేయాలని ఆదేశించారు. గత ఎన్నికల సమయంలో సమస్యలు సృష్టించిన ప్రదేశాల్లో నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ర్యాలీలు, సమావేశాలకు ఎన్నికల నిబంధనలకు లోబడి అనుమతులివ్వాలని సూచించారు. జిల్లా ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ప్రకారం బందోబస్తు తయారు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్, రమేశ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల బతుకులు మారాలి



ప్రజాఎజెండాలో పాల్గొన్న పారిశుద్ధ్య కార్మికులు

ప్రజా ఎజెండా

- ఉద్యోగ భద్రత కల్పించాలి
- ప్రజా ఎజెండాలో పారిశుద్ధ్య కార్మికులు

ఆసిఫాబాద్: 'ప్రభుత్వాలు మారినా.. ప్రజాప్రతినిధులు మారినా.. మా బతుకులు మాత్రం మారడం లేదు. అపరిశుభ్ర వాతావరణంలో పనిచేస్తూ.. అనారోగ్యం బారిన పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.. కొత్తగా ఏర్పడే ప్రభుత్వంలో అయినా మా బతుకులు మారాలి..' అని పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారంగా మారిందని వారు పేర్కొన్నారు. పనిభారం తగ్గించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలో సోమవారం ఉదయం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాఎజెండా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు తమ అభిప్రాయాలు వెల్లడించారు.

సమస్యలు పరిష్కరించాలి



కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి. ఇటీవల 34 రోజులపాటు జీపీ కార్మికులు సమ్మె చేయగా స్పష్టమైన హామీ మేరకు విరమించాం. వెంటనే హామీలను అమలుపర్చాలి.
– మెతె వెంకటి

హామీలు విస్మరించారు



కొత్తగా ఏర్పడే ప్రభుత్వంతో అయినా కార్మికుల బతుకులు మారాలి. రిటైర్మెంట్‌కు దగ్గర పడుతున్నా ఉద్యోగ భద్రత కల్పించడం లేదు. సమ్మె కాలంలో అన్ని పార్టీలు హామీలిచ్చి విస్మరించాయి. కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి.
– ఉప్పరి లక్ష్మి

ఉద్యోగ భద్రత కల్పించాలి



25 ఏళ్లుగా ఆసిఫాబాద్ గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్నా. ప్రభుత్వం కార్మికుల సేవలు గుర్తించాలి. సమ్మె కాలంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.
– మోతె లక్ష్మి

పట్టింపులేదు



పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమంపై ఎవరికీ పట్టింపు లేదు. చాలీచాలని వేతనాలతో పదేళ్లుగా పనిచేస్తున్నాం. పాలకులు తమను గుర్తించడం లేదు. పర్మినెంట్ చేసి, దళిత బంధు పథకం అమలు చేయాలి.
– మాట్ల ఇస్తారి

'మల్టీపర్పస్' రద్దు చేయాలి



రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత కల్పించడం లేదు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి. కార్మికుల సంక్షేమం దృష్ట్యా జీవో 51 రద్దు చేసి జీవో 60 ప్రకారం కార్మికులకు రూ.26 వేల వేతనం చెల్లించాలి.
– చునార్కర్ శంకర్

వేతనాలు నెలనెలా చెల్లించాలి



పంచాయతీ కార్మికులకు ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలి. రెండు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నవి. సకాలంలో జీతాలు అందేలా చూడాలి. ఇళ్ల స్థలాలు కేటాయించి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి.
– పొత్తూరి రాజేందర్

వేతనం సరిపోతలేదు



చాలీచాలని వేతనాలు చెల్లించడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం రూ.7,500 నుంచి రూ.9,500 వరకు ఒక్కొక్కరికి ఒక్కోవిధంగా చెల్లిస్తోంది. ఖర్చులు విపరీతంగా పెరగడంతో అవి సరిపోతలేవు.
– దుర్గం నారాయణ

అసెంబ్లీలో చర్చించాలి



పారిశుద్ధ్య కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి. తెలంగాణ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా కాంట్రాక్టు ఉద్యోగులను కొనసాగిస్తున్నారు. హామీ ప్రకారం పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి. ఉచితంగా వైద్యసేవలు అందించాలి.
– పొర్ల తిరుపతి

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

వాంకిడి: మండల కేంద్రంలో జాతీయ రహదారి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని లక్ష్మీనగర్‌కు చెందిన వినోద్ రాత్రి ఇంటికి వెళ్లే క్రమంలో కాలినడకన రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో పడి ఉన్న వినోద్‌ను స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మంచిర్యాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, ఈ విషయంపై ఎస్సై సాగర్‌ను సంప్రదించగా ప్రమాదానికి సంబంధించిన ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఒకరికి ఐదేళ్ల జైలు

కౌటాల: మద్యం మత్తులో బైక్ నడిపి మహిళ మృతికి కారణమైన ఒకరికి ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రూ. 5 వేల జరిమానా, మరొకరికి 8 వేల జరిమానా విధిస్తూ సోమవారం ఆసిఫాబాద్ కోర్టు న్యాయమూర్తి ఎంపీ రమేశ్ తీర్పునిచ్చారు. కౌటాల ఎస్సై మధుకర్ కథనం ప్రకారం.. 2019, మే 12న గుండాయిపేట్ సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో మహారాష్ట్రకు చెందిన గెడెం అర్చన మృతిచెందింది. మృతురాలి బంధువు మేస్రం అంకుస్ ఫిర్యాదుతో అప్పటి ఎస్సై ఆంజనేయులు కేసు దర్యాప్తు చేశారు. కోర్టులో పీపీ జగన్‌మోహన్‌రావు వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో ఏ1 చెన్నకర్ సురాజ్‌కు ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.5వేల జరిమానా, ఏ2 చాప్లే జీజాబాయికి రూ.8 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారని ఎస్సై వివరించారు. హెడ్‌కానిస్టేబుల్ బాబాజీ ఉన్నారు.

మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యంతో పోలీసులు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బాబాపూర్ అంకుసపూర్‌లో సోమవారం అక్రమ మద్యం పట్టుకుని, బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ మోహన్ అలీ తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ అందించిన సమాచారంతో దాడులు చేసి 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్సై విజయలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ ధర్మ ప్రకాశ్, సిబ్బంది మహేశ్, సురేశ్, కిరణ్ దిలీప్ పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఆపరేటర్ మృతి

భైంసా: బాసర మండలం కిర్గుల్(కె) గ్రామంలో వరికోత మిషన్ ఆపరేటర్ విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..కర్నాటకకు చెందిన నేరపాది(23) వరికోతల కోసం ముధోల్ ప్రాంతానికి వచ్చాడు. సోమవారం వరికోత కోసం బాసర మండలం కిర్గుల్(కె) గ్రామానికి వెళ్తుండగా రోడ్డుకు ఆనుకుని ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు తగలి షాక్‌కు గురయ్యాడు. అపస్మారక స్థితికిచేరుకున్న అతన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే 90 శాతం గాయాలతో ఉన్న నేరపాది మృతిచెందాడు.

ఓట్లే.. సీట్లు లేవు!

జంగ్ తెలంగాణ

- కార్మికవర్గానికి ఏ పార్టీలో దక్కని టికెట్లు
- సింగరేణి నేతలకు మొండిచెయ్యి
- ఈసారి టికెట్ ఆశించినవారికి భంగపాటే
- 12 నియోజవకర్గాల్లో సింగరేణి ఓట్లు కీలకం
- గెలుపోటములను నిర్ధారించేది ఈ ఓటర్లే



శ్రీరాంపూర్: రాష్ట్రంలోనే అతిపెద్ద పరిశ్రమ సింగరేణి. ఆరు జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సింగరేణి విస్తరించి ఉంది. 43 వేల మంది పర్మినెంట్ ఉద్యోగులు, 28 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఈ సంస్థలో పనిచేస్తున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా సింగరేణి అంతటా కలిపి సుమారు 3.5 లక్షల పైచిలుకు ఓటర్లు ఉన్నారు. ఈ ప్రాంతంలో పోటీచేసే అభ్యర్థుల గెలుపోటములు డిసైడ్ చేసేది సింగరేణి ఓటర్లే. దీంతో ప్రధానపార్టీలు ప్రతిసారి వారి ఓట్ల కోసమే వెంపర్లాడుతాయి. కాని కార్మికవర్గానికి సీట్లు ఇవ్వడంలో మొండిచెయ్యి చూపెడుతున్నాయి. ఈసారి ఎన్నికల్లో ఒక్క టికెట్ కేటాయించలేదు. దీనిపై సింగరేణిలో తీవ్ర చర్చ జరుగుతోంది. కార్మికవర్గం అసెంబ్లీ గడప తొక్కేదెప్పుడు, తమ గళం వినిపించేదెప్పుడని ప్రశ్నిస్తున్నారు.

జిల్లాల పరిధిలో..

మంచిర్యాల, కుమురం భీం, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో సింగరేణి విస్తరించి ఉంది. ఈ జిల్లాల పరిధిలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, ఆసిఫాబాద్, రామగుండం, మంథని, పెద్దపల్లి, భూపాలపల్లి, కొత్తగూడెం, సత్తుపల్లి, ఇల్ల ందు, పినపాక అసెంబ్లీ సెగ్మెంట్లలో సింగరేణి ఓటర్లు కీలకంగా ఉన్నారు. ఇక్కడ పార్టీ అభ్యర్థి గెలవాలంటే కార్మికుల ఓట్లు తప్పనిసరి. దీంతో అన్నిపార్టీలు సింగరేణిలో వారి అనుబంధ కార్మిక సంఘాల మద్దతుతోనే సింగరేణి ఓట్లు వేయించుకోవడం పరిపాటే.

కార్మికవర్గానికి ప్రాధాన్యత ఏది?

రాష్ట్ర సాధనలో సకలజనుల సమ్మె చేసిన చరిత్ర సింగరేణి కార్మికులది. ఇంతటి ఉద్యమ స్ఫూర్తి, ఎన్నో త్యాగాలు చేసి స్వరాష్ట్రాన్ని సాధించిన కూడా సింగరేణి గళం అసెంబ్లీలో వినిపించడం లేదు. ఇటీవల అన్నిపార్టీలు ప్రకటించిన అభ్యర్థుల్లో ఎక్కడ కూడా కార్మికవర్గానికి ప్రాధాన్యత కల్పించలేదు. ప్రస్తుత టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావుకు అధికార బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఇస్తామని హామీ ఇచ్చిన అధిష్టానం అది నెరవేర్చలేదని ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు. 2014 ఎన్నికల్లో కార్మికవర్గం నుంచి శ్రీరాంపూర్‌కు చెందిన టీబీజీకేఎస్ నాయకుడు పెట్టం లక్ష్మణ్‌కు టికెట్ ఇవ్వడానికి బీఆర్ఎస్ నిర్ణయించి చివరి నిమిషంలో మొండి చెయ్యి చూపింది.

వారికి మొండిచెయ్యి..

ప్రధాన పార్టీల నేతలు సింగరేణిని పట్టించుకోకున్నా చివరికి ఒకరిద్దరు నేతలు వారి మాతృపార్టీల టికెట్లు ఆశించారు. వారికి కూడా మొండిచెయ్యి మిగిలింది. రామగుండం నుంచి టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య టికెట్ కావాలని బీఆర్ఎస్ అధిష్టానానికి మొర పెట్టుకున్నా ఫలితం లేకపోయింది. ఇక్కడ సిట్టింగ్ చందర్‌కే ఇచ్చారు. ఇదే నియోజవర్గంలో కాంగ్రెస్ నుంచి ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ టికెట్ ఆశించిన నిరాశే ఎదురైంది. ఇక కమ్యూనిస్టు పార్టీలది కూడా అదే తీరుగా ఉంది. బెల్లంపల్లి నుంచి రేగుంట చంద్రశేఖర్ అనే సింగరేణి మాజీ ఉద్యోగి సీపీఐ నుంచి టికెట్ ఆశించాడు. పొత్తుల భాగంగా ఇది కాంగ్రెస్‌కు పోయింది. చివరికి చెన్నూర్ ఇస్తారనుకుంటే అక్కడ కూడా వివేక్ రావడంతో నిరాశే మిగిలింది.

సమైక్యాంధ్రలోనే గుర్తింపు

సమైక్యాంధ్రలోనే సింగరేణి కార్మికవర్గానికి గుర్తింపు ఉంది. 2009 కాంగ్రెస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి.. అప్పటి ఐఎన్టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రస్తుత టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావుకు ఎమ్మెల్సీగా గుర్తింపునిచ్చారు. అంతకుముందు ఉమ్మడి కరీంనగర్ జిల్లా మేడారం నుంచి సింగరేణి ఉద్యోగి మాలేం మల్లేశ్‌కు టీడీపీ టికెట్ ఇచ్చి గెలిపించింది. తర్వాత 2004 ఉద్యమ సమయంలో కేసీఆర్ సింగరేణి ఉద్యోగి అయిన కొప్పుల ఈశ్వర్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంతో ఆయన గెలిచారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో బెల్లంపల్లి నుంచి సింగరేణి ఉద్యోగి రాజేశ్వర్ రావు భార్య అమురాజుల శ్రీదేవి, చెన్నూర్ నుంచి బోడ జనార్దన్ టీడీపీ తరుపున గెలిచారు. ఈసారి శ్రీదేవి బెల్లంపల్లి బీజేపీ నుంచి బరిలో నిలిచారు.

అలజడి నుంచి ప్రశాంతత వైపు

- పెరిగిన పోలీసుల నిఘా.. నిత్యం తనిఖీలు
- మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నతాధికారుల పర్యటనలు
- సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక బలగాలు

జిల్లాలో పోలింగ్ కేంద్రాలు
మొత్తం 801
సాధారణం 635
సమస్యాత్మకం 113
అంత్యంత సమస్యాత్మకం 53



చెన్నూర్‌లో పోలీసు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

చెన్నూర్: నాడు అలజడి మధ్య ఎన్నికల జరుగగా, నేడు ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఒకప్పుడు చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో మవోయిస్టుల అలజడి ఎక్కువగా ఉండేది. ఆ రోజుల్లో ఈ రెండు నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణ అధికార యంత్రాంగానికి సవాల్‌గా మారింది. ఎన్నికలు ముగిసే వరకు అధికార యంత్రాంగం ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని విధులు నిర్వహించిన రోజులవి. 1994 నుంచి 2009 వరకు జరిగిన ఎన్నికల సమయంలో మావోయిస్టుల ప్రభావం కనిపించింది. నేటికీ జిల్లాలోని చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలు మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాలుగా పేరుంది.

తగ్గిన ప్రభావం

చెన్నూర్ నియోజకవర్గం కోటపల్లి, బెల్లంపల్లి నియోజకవర్గం వేమనపల్లి మండలాలు అటవీ ప్రాంతాలు కావడంతోపాటు గ్రామీణ ప్రాంతాలకు రోడ్ల సౌకర్యం లేదు. సమాచార వ్యవస్థ సైతం అందుబాటులో లేకపోవడంతో ఈ రెండు నియోజకవర్గాల్లో మావోయిస్టుల ఆధిపత్యం కొనసాగింది. నేడు గ్రామాలకు రవాణా, సమాచార వ్యవస్థ అభివృద్ధి చెందింది. పోలీసుల నిఘాతోపాటు పటిష్టమైన సమాచార వ్యవస్థ మెరుగైంది. గ్రామీణ ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే క్షణాల్లో పోలీసులకు సమాచారం అందుతోంది. దీంతోపాటు మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో నిత్యం పోలీసుల పర్యటనలు, వివిధ సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో మావోయిస్టుల ప్రభావం తగ్గుముఖం పట్టింది. దీంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుగుతున్నాయి.

నాటి ఘటనలు

- 1999లో జరిగిన సాధారణ ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకున్నట్లు ప్రచారం జోరుగా సాగింది.
- ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కోటపల్లి మండలం కొండంపేట గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ నాయకుడు పోటు సత్యనారాయణరెడ్డిని చెన్నూర్ దళం బంధించి ఎన్నికల ప్రచారంలో పాల్గొనని ప్రమాణం చేయించి ముక్కు నెలకు రాయించారు.
- గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేయద్దని మవోయిస్టులు అల్టిమేటం జారీ చేశారు.
- కోటపల్లి మండలంలోని మల్లంపేటలో ఫారెస్ట్ కలప డిపోను మావోయిస్టులు దహనం చేయగా సుమారు రూ.80 వేల నష్టం వాటిల్లింది.
- కోటపల్లి మండలం సిర్సా గ్రామంలో 1999 అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్స్‌లు తీసుకొని వస్తున్న ట్రాక్టర్‌ను ఎదుల్లబంధం వద్ద మావోయిస్టులు దహనం చేశారు. సిర్సాలో ఉప ఎన్నికలు జరిగాయి.

రాత్రి కాంగ్రెస్‌లోకి.. ఉదయం బీఆర్ఎస్‌లోకి



ఆదివారం రాత్రి వివేక్ సమక్షంలో కాంగ్రెస్‌లోకి సతీశ్



సోమవారం ఉదయం గులాబీ కండువా కప్పుకుని సతీశ్ ప్రచారం(మధ్యలో ఉన్న వ్యక్తి)

చెన్నూర్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో చేరికలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో చెన్నూర్‌కు చెందిన బీఆర్ఎస్ మాజీ పట్టణ అధ్యక్షుడు, 17 వార్డు కౌన్సిలర్ నాయిని శ్యామల భర్త సతీశ్ స్థానిక ఎంఆర్ఆర్ గార్డెన్‌లో ఆదివారం రాత్రి మాజీ ఎంపీ వివేక్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. సోమవారం ఉదయం బీఆర్ఎస్ కండువా కప్పుకుని ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గంటల వ్యవధిలోనే వేర్వేరు పార్టీల కండువాలు కప్పుకోవడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు.

ముగిసిన చేపలపెంపకం శిక్షణ



గుర్తింపుపత్రాలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ఐదురోజుల పాటు కొనసాగిన చేపల పెంపకం శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. కేవీకే ప్రాంగణంలో చేపల పెంపకం, విలువ ఆధారిత ఉత్పత్తులపై ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చారు. కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు చెందిన యువకులు శిక్షణలో పాల్గొన్నారు. విజయవంతంగా శిక్షణకు హాజరైన 25 మంది యువకుల్లో నైపుణ్యత కనబర్చిన యువకులకు కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివకృష్ణ, శాస్త్రవేత్తలు బహుమతులు, గుర్తింపు పత్రాలు అందజేశారు. కేవీకే శాస్త్రవేత్తలు తిరుపతి, సతీశ్, నాగరాజు, మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు మంచిర్యాలలో ఈ నెల 4న జరిగిన జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరస్వామి తెలిపారు. 2023–24ను ప్రభుత్వం మిల్లెట్ ఇయర్‌గా ప్రకటించిన సందర్భంగా మిల్లెట్స్ మన ఆహారం అనే అంశాన్ని తీసుకుని ప్రచారయుద్ధం అనే సైన్స్ నాటికను ప్రదర్శించినట్లు తెలిపారు. ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు రమా, అక్షయ, బిందుప్రియ, సాగర్, నరేందర్, ఐశ్వర్య, అఖిల, వినయ్, లక్ష్మణ్‌లను డీఈవో యాదయ్య, ఏంఈవో వాసాల ప్రభాకర్ అభినందించి రాష్ట్ర స్థాయిలో రాణించాలని తెలిపారు. రచన, దర్శకత్వం వహించిన గైడ్ టీచర్ శాంకరీని ప్రత్యేకంగా అభినందించారు. ఈ నెల 8న ఎస్ఈఆర్టీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

రాజ్యాంగ రక్షణకు ఉద్యమించాలి

పాతమంచిర్యాల: మన దేశ రాజ్యాంగ పరిరక్షించుకోవడానికి ఐక్యంగా ఉద్యమించాలని నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అబ్దుల్ నూర్‌పాషా పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలో సోమవారం నిర్వహించిన లాల్‌నీల్ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. దేశంలో వామపక్షాలు, బహుజనుల మధ్య ఐక్యత లేని కారణంగా దేశంలో మతోన్మాద శక్తులు పెట్రేగిపోతున్నాయన్నారు. లాల్‌నీల్ ఐక్యవేదిక జిల్లా నాయకుడు రేఖాచంద్రశేఖర్‌రావు, మాట్లాడుతూ దేశంలో మనువాద మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. అనంతరం మార్క్స్, అంబేడ్కర్‌లు మన మార్గదర్శకులు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ నాయకులు రాములు, సీపీఐ ఎంఎల్‌రాష్ట్ర కమిటీ నాయకులు టి.శ్రీనివాస్, బి.జయరావు, కాదాసి రవీందర్, జిల్లా కార్యదర్శి సంకె రవి, న్యూడెమోక్రసీ నాయకులు లాల్‌కుమార్, ప్రజా సంఘాల నాయకులు జయరావు, కనుకుట్ల మల్లయ్య, పలిగిరి కనకరాజు, రంగు రాజేశం, వడ్డెపల్లి మనోహర్ ప్రకాశ్, రంజిత్ పాల్గొన్నారు.



లాల్‌నీల్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇత్తడి రేకుపై యాదాద్రి ఆలయ నమూనా



నరసింహస్వామి ఆలయ నమూనా చూపిస్తున్న స్వర్ణకారుడు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణానికి చెందిన స్వర్ణకారుడు బళ్లారి రఘుపతి యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ నమూనాను కిలో ఇత్తడి రేకుపై తయారు చేశాడు. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణను ఎంతో అభివృద్ధి చేశారని, యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని ఎంతో సుందరంగా నిర్మించారని, అభిమానంతో ఆలయ నమూనాపై శివుని రూపంలో ఉన్న కేసీఆర్‌ను తయారు చేశాడు. మంగళవారం మందమర్రికి ప్రజా ఆశీర్వాద సభకు విచ్చేస్తున్న కేసీఆర్‌కు ఈ నమూనాను బహుమతిగా ఇస్తానని, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించాడు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య



బాపురావు (ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రవీణ్ కథనం ప్రకారం.. మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన కవల్కర్ బాపురావు (47) ఈ ఏడాది మూడెకరాల్లో పత్తి సాగు చేశారు. పంట ఆశించిన మేర లేకపోవడంతో దిగుబడి తక్కువ వస్తుందని రోజు మద్యం తాగి ఇంటికి వస్తుండేవాడు. సోమవారం ఉదయం మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఇంటికి వచ్చాడు. కుటుంబ సభ్యులు గమనించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

నస్పూర్: పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో స్టార్‌టైగర్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 5న నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో నస్పూర్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించారు. పట్టణంలోని బ్రిలియంట్ మోడల్ స్కూల్ విద్యార్థులు కటాస్ విభాగంలో ఆర్.రమాకాంత్, ఎస్‌కే అబ్దుల్, టి.అశ్రిత్‌లకు ప్రథమ స్థానం, ఆర్.రాకేశ్, హిల్‌నాథ్ ద్వితీయ స్థానంలో నిలిచారు. పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో యాజమాన్యం వారిని అభినందించారు. కరాటే మాస్టర్ రంగ రమేశ్, సిబ్బంది సారిక, కవిత తదితరులు పాల్గొన్నారు.

‘ఇన్‌చార్జిపై చర్య తీసుకోవాలి’



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

కాసిపేట: కేకే ఓసీపీలో మైనింగ్‌స్టాఫ్ సూపర్‌వైజర్‌పై సోమవారం ఉదయం దాడిచేసిన ఆర్‌వీఆర్ ప్రైవేట్ కంపెనీ ఇన్‌చార్జి జగదీశ్‌పై చర్య తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేఫ్టీకి విరుద్ధంగా ఫైవ్ క్యూబిక్ మీటర్ షావెల్ వద్ద ఇన్‌చార్జి జగదీశ్ ఫోన్ ద్వారా వీడియో, ఫోటో తీస్తుండగా వద్దన్నందుకు సూపర్‌వైజర్‌పై దాడి చేశారన్నారు. జగదీశ్‌పై అధికారులు చర్య తీసుకోవాలని, లేకపోతే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, మందమర్రి బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, కేకే ఏసీ ఫిట్ కార్యదర్శి మర్రి కుమార్, మైనింగ్‌స్టాఫ్ ఇన్‌చార్జి గోపతి సత్యనారాయణ ఉన్నారు.

నేడు ఉమ్మడి జిల్లాస్థాయి ఖోఖో ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్ ఆశ్రమ క్రీడా పాఠశాలలో మంగళవారం ఉమ్మడి జిల్లా బాలుర సబ్ జూనియర్ అండర్–14 ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.శ్రీధర్‌రెడ్డి, జి.ఈశ్వర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్, బోనాఫైడ్ సర్టిఫికెట్లతో పాఠశాల కోచ్ శివకుమార్ వద్ద రిపోర్ట్ చేయాలని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈ నెల 15, 16, 17 తేదీల్లో మెదక్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. వివరాలకు 9398430685, 9573866008, 9440064422 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బీఆర్ఎస్‌లోకి ఎంసీపీఐ (యూ) నేత కృష్ణ



కృష్ణ

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని కృష్ణ అధికార బీఆర్ఎస్ పార్టీలో చేరడానికి రంగం సిద్ధమైంది. మంగళవారం ఆ పార్టీకి రాజీనామా చేసి ఈ నెల 8న బెల్లంపల్లికి రానున్న సీఎం కేసీఆర్ సమక్షంలో చేరడానికి సిద్ధమయ్యారు. 1980 నుంచి ఎర్రజెండా పార్టీలో కృష్ణ పని చేస్తున్నారు. ఆదిలో సీపీఐలో పనిచేసిన కృష్ణ ఆ తర్వాత ఆ పార్టీని వీడి దశాబ్దకాలం క్రితం ఎంసీపీఐ(యూ)లో చేరారు. ఆ పార్టీలో అన్నీ తానై వ్యవహరించారు. ఆ పార్టీ అనుబంధ కార్మిక, సాంస్కృతిక విభాగాల్లో రాష్ట్ర నాయకుడిగా పని చేశారు. అసెంబ్లీ ఎన్నికలను నేపథ్యంలో ఇటీవల కృష్ణను బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు తమ పార్టీలో చేరాలని రాయబారాలు చేయగా చివరికి బీఆర్ఎస్‌లో చేరికకు సంసిద్ధత వ్యక్తం చేశారు.

‘ప్రజాఆశీర్వాద సభ’ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లయ్య

మందమర్రిరూరల్: మందమర్రిలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో మంగళవారం నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య కోరారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్‌కు సింగరేణి అంటే ఎంతో మక్కువ అన్నారు. గతేడాది సంస్థకు వచ్చిన లాభాల్లో 32 శాతం పంచారని తెలిపారు. ఈ సభకు సింగరేణి ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సంపత్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్, శ్రీనివాస్, రాజశేఖర్, సంపత్, శంకర్, రాంవేణు తదతరులు పాల్గొన్నారు.

భార్యను వేధించిన భర్తకు జైలు

ఖానాపూర్: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు 7 నెలల సాధారణ జైలుశిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ ఖానాపూర్ కోర్టు జడ్జి జితిన్‌కుమార్ సోమవారం తీర్పుచెప్పారు. ఖానాపూర్ ఎస్సై లింబాద్రి కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్‌కు చెందిన ఆడె పుష్పలత (35)కు ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్‌కు చెందిన ఆడెపు వేణుగోపాల్‌తో 2009లో వివాహమైంది. వీరి కాపురం సజావుగా సాగింది. కొన్నినెలల తర్వాత రూ.5 లక్షల అదనపు కట్నం తేవాలని, మానసికంగా, శారీరకంగా భార్యను వేధించసాగాడు. వేధింపులు తీవ్రం కావడంతో భార్య 2012లో అప్పటి ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై రాము కేసు నమోదు చేశారు. ఏపీపీవో రామకృష్ణ కోర్టులో 9 మంది సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. దీంతో 7నెలల జైలు శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చినట్లు ఎస్సై వివరించారు.



పారిస్ ఒలింపిక్స్ హాకీ క్వాలిఫయింగ్ టోర్నీ: భారత్‌కు కఠిన సవాలు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించేందుకు భారత మహిళల హాకీ జట్టు శ్రమించాల్సి ఉంటుంది. జనవరి 13 నుంచి 19 వరకు రాంచీలో జరిగే ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీ-1కు సంబంధించిన వివరాలను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) సోమవారం విడుదల చేసింది. ప్రపంచ ఆరో ర్యాంకర్ భారత్‌తోపాటు ఈ టోర్నీలో ప్రపంచ ఐదో ర్యాంకర్ జర్మనీ, న్యూజిలాండ్ (9), జపాన్ (11), చిలీ (14), అమెరికా (15), ఇటలీ (19), చెక్ రిపబ్లిక్ (25) జట్లు బరిలో ఉన్నాయి. ఈ టోర్నీలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు నెగ్గిన మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాయి. జనవరి 13 నుంచి 20 వరకు స్పెయిన్‌లోని వాలెన్సియాలో ఎనిమిది జట్ల (బెల్జియం, కెనడా, బ్రిటన్, ఐర్లాండ్, మలేసియా, దక్షిణ కొరియా, స్పెయిన్, ఉక్రెయిన్) మధ్య క్వాలిఫయింగ్-2 టోర్నీ జరుగుతుంది. ఈ టోర్నీ ద్వారా మరో మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందుతాయి.

డబుల్ ధమాకా...





- స్విస్ గ్రాండ్ చెస్ టోర్నీలో విజేతలుగా నిలిచిన వైశాలి, విదిత్
- ఇద్దరూ క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత

ఐల్ ఆఫ్ మ్యాన్ (యూకే): అంతర్జాతీయ వేదికపై భారత చెస్ క్రీడాకారులు ఆర్. వైశాలి, విదిత్ సంతోష్ గుజరాతి సత్తా చాటుకున్నారు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ఆధ్వర్యంలో ఐల్ ఆఫ్ మ్యాన్ దీవిలో జరిగిన స్విస్ గ్రాండ్ టోర్నీలో ఓపెన్ విభాగంలో విదిత్ (మహారాష్ట్ర), మహిళల విభాగంలో వైశాలి (తమిళనాడు) చాంపియన్స్‌గా అవతరించారు. ఈ టోర్నీలో టైటిల్ సాధించిన తొలి భారతీయ క్రీడాకారులుగా వీరిద్దరు గుర్తింపు పొందారు. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత విదిత్ 8.5 పాయింట్లతో... వైశాలి కూడా 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. విదిత్ ఏడు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిపోయాడు. వైశాలి ఆరు గేముల్లో నెగ్గి, ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచింది. చాంపియన్స్‌గా నిలిచిన విదిత్‌కు ట్రోఫీలతో పాటు 80 వేల డాలర్లు (రూ. 66 లక్షల 57 వేలు), వైశాలికి ట్రోఫీలతో పాటు 25 వేల డాలర్లు (రూ. 20 లక్షల 80 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఈ టైటిల్స్‌తో ఓపెన్ విభాగంలో విదిత్... మహిళల విభాగంలో వైశాలి క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించారు. ఓపెన్, మహిళల విభాగాల్లో వేర్వేరుగా ఎనిమిది మంది ప్లేయర్ల మధ్య క్యాండిడేట్స్ టోర్నీ వచ్చే ఏడాది ఏప్రిల్‌లో 2 నుంచి 25 వరకు కెనడాలోని టొరంటోలో జరుగుతుంది. క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలిచిన వారు ఓపెన్ విభాగంలో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో... మహిళల విభాగంలో ప్రస్తుత వరల్డ్ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)తో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం తలపడతారు.

గట్టెక్కిన బంగ్లాదేశ్

- వరుస ఆరు పరాజయాల తర్వాత మరో విజయం
- ప్రపంచకప్‌లో తొలిసారి శ్రీలంకపై గెలుపు
- కెప్టెన్ షకీబ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- అసలంక సెంచరీ వృథా


నజ్ముల్ షకీబ్


అసలంక

న్యూఢిల్లీ: ప్రపంచకప్‌లో అద్భుతం సాధిద్దామనే లక్ష్యంతో భారత గడ్డపై అడుగుపెట్టిన బంగ్లాదేశ్ తొలి మ్యాచ్‌లో గెలిచి శుభారంభం చేసింది. ఆ తర్వాత ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు కాదు.. వరుసగా ఆరు పరాజయాలను చవిచూసి సెమీ ఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ ప్రపంచకప్‌లో టాప్-7లో నిలిస్తేనే 2025 చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించే అవకాశం ఉండటంతో బంగ్లాదేశ్‌కు ఎనిమిదో మ్యాచ్ కీలకంగా మారింది. మాజీ విశ్వవిజేత శ్రీలంకతో జరిగిన ఈ పోరులో బంగ్లాదేశ్ మూడు వికెట్ల తేడాతో నెగ్గి మళ్లీ గెలుపు బాట పట్టింది. గెలుపుదారిలో వికెట్లను చేజార్చుకోవడం కలవరపెట్టినా... చివరకు బంగ్లాదేశ్ నుంచి విజయం మాత్రం చేజారలేదు. ప్రపంచకప్ చరిత్రలో శ్రీలంకపై బంగ్లాదేశ్‌కిదే తొలి విజయం కావడం విశేషం. 280 పరుగుల లక్ష్య ఛేదనలో నజ్ముల్ హొస్సేన్ షాంతో (101 బంతుల్లో 90; 12 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షకీబుల్ హసన్ (65 బంతుల్లో 82; 12 ఫోర్లు, 2 సిక్సర్లు) కీలకపాత్ర పోషించారు. చివర్లో తౌహిద్ హ్రిదయ్ (7 బంతుల్లో 15 నాటౌట్; 2 సిక్సర్లు) నిలబడి బంగ్లాదేశ్ విజయాన్ని ఖాయం చేశారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 279 పరుగుల వద్ద ఆలౌటైంది. చరిత్ అసలంక (105 బంతుల్లో 108; 6 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీ సాధించాడు. ప్రత్యర్థి బౌలర్లు తంజిమ్ హసన్ (3/80), షోరిఫుల్ (2/51), షకీబుల్ హసన్ (2/57) సమష్టిగా వికెట్లు పడగొట్టారు. అనంతరం బంగ్లాదేశ్ 41 పరుగులకే ఓపెనర్లు తంజిద్ హసన్ (9), లిటన్ దాస్ (23) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో నజ్ముల్, షకీబ్ అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. మూడో వికెట్‌కు 169 పరుగులు జోడించారు. 210 వద్ద షకీబ్, మరో పరుగు తర్వాత నజ్ముల్ నిష్క్రమించారు. మహ్మదుల్లా (22), ముష్ఫికర్ (10), మిరాజ్ (3) స్వల్ప వ్యవధిలో అవుటవ్వడంతో బంగ్లాదేశ్‌కు ఇబ్బంది ఎదురైంది. అయితే తౌహిద్, తంజిమ్ జట్టును విజయతీరానికి చేర్చారు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (బి) తంజిమ్ 41; పెరీరా (సి) ముష్ఫికర్ (బి) షోరిఫుల్ 4; మెండిస్ (సి) షోరిఫుల్ (బి) షకీబ్ 19; సమరవిక్రమ (సి) మహ్మదుల్లా (బి) షకీబ్ 41; అసలంక (సి) లిటన్ (బి) తంజిమ్ 108; మాథ్యూస్ (టైమ్డ్ అవుట్) 0; ధనంజయ (స్టంప్డ్) ముష్ఫికర్ (బి) మిరాజ్ 34; తీక్షణ (సి) సబ్-అహ్మద్ (బి) షోరిఫుల్ 21; చమీర (రనౌట్) 4; రజిత (సి) లిటన్ (బి) తంజిమ్ 0; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 279. వికెట్ల పతనం:** 1-5, 2-66, 3-72, 4-135, 5-135, 6-213, 7-258, 8-278, 9-278, 10-279. **బౌలింగ్:** షోరిఫుల్ 9.3-0-51-2, టస్కిన్ 10-1-39-0, తంజిమ్ హసన్ 10-0-80-3, షకీబ్ 10-0-57-2, మిరాజ్ 10-0-49-1. **బంగ్లాదేశ్ ఇన్నింగ్స్:** తంజిద్ (సి) నిసాంక (బి) మదుషంక 9; లిటన్ దాస్ (ఎల్బీ డబ్ల్యూ) (బి) మదుషంక 23; నజ్ముల్ (బి) మాథ్యూస్ 90; షకీబ్ (సి) అసలంక (బి) మాథ్యూస్ 82; మహ్మదుల్లా (బి) తీక్షణ 22; ముష్ఫికర్ (బి) మదుషంక 10; తౌహిద్ (నాటౌట్) 15; మిరాజ్ (సి) అసలంక (బి) తీక్షణ 3; తంజిమ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (41.1 ఓవర్లలో 7 వికెట్లకు) 282. వికెట్ల పతనం:** 1-17, 2-41, 3-210, 4-211, 5-249, 6-255, 7-269. **బౌలింగ్:** మదుషంక 10-1-69-3, తీక్షణ 9-0-44-2, కసున్ రజిత 4-0-47-0, చమీర 8-0-54-0, మాథ్యూస్ 7.1-1-35-2, ధనంజయ డిసిల్వా 3-0-20-0.

మాథ్యూస్ 'టైమ్డ్ అవుట్'

తొలి క్రికెటర్‌గా గుర్తింపు



శ్రీలంక క్రికెటర్ ఏంజెలో మాథ్యూస్ అనూహ్య, అరుదైన రీతిలో అవుటై క్రికెట్ చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు. 146 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్‌లో 'టైమ్డ్ అవుట్' ద్వారా అవుట్ అయిన తొలి క్రికెటర్‌గా అతను నిలిచాడు. సోమవారం బంగ్లాదేశ్‌తో న్యూఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. లంక ఇన్నింగ్స్ 25వ ఓవర్ రెండో బంతికి సమరవిక్రమ అవుటయ్యాడు. నిబంధనల ప్రకారం తర్వాతి బ్యాటర్ 2 నిమిషాల్లోగా బంతిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. క్రీజ్‌లోకి మాథ్యూస్ సరైన సమయానికే వచ్చినా బంతిని ఎదుర్కోవడంలో ఆలస్యం చేశాడు. తన హెల్మెట్‌ను సరి చేసుకుంటుండగా దాని స్ట్రాప్ తెగింది. దాంతో మరో హెల్మెట్ కోసం సైగ చేయగా, చమిక మైదానంలోకి పరుగెత్తుకుంటూ వచ్చాడు. అప్పటికే సమయం మించిపోవడంతో బౌలర్, బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ 'టైమ్డ్ అవుట్' కోసం అప్పీల్ చేశాడు. దాంతో అప్పీల్‌ను పరిగణనలోకి తీసుకున్న అంపైర్లు చర్చించి నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను 'అవుట్'గా ప్రకటించారు. తన హెల్మెట్ సమస్యను బ్యాటర్ అంపైర్లకు వివరించినా వారు స్పందించలేదు. ఆ తర్వాత అప్పీల్ వెనక్కి తీసుకోమని షకీబ్‌ను కూడా కోరినా అతను ససేమిరా అనడంతో మాథ్యూస్ వెనుదిరగక తప్పలేదు. అనంతరం ఫోర్త్ అంపైర్ ఏడ్రియన్ హోల్డ్‌స్టాక్ దీనిపై మరింత స్పష్టతనిచ్చారు. 'మాథ్యూస్‌కు హెల్మెట్ సమస్య కూడా రెండు నిమిషాల తర్వాత వచ్చింది. అప్పటికే అతను బంతిని ఎదుర్కోకుండా ఆలస్యం చేశాడు. క్రీజ్‌లోకి వచ్చే ముందు ఎక్విప్‌మెంట్‌లో అన్నింటినీ సరిగ్గా చూసుకోవడం కూడా బ్యాటర్‌దే బాధ్యత' అని ఆయన చెప్పారు. దాంతో షకీబ్ క్రీడా స్ఫూర్తి అంశాన్ని పక్కన పెడితే నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను అవుట్‌గా ప్రకటించడం సరైందే.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	8	6	2	12	1.376
ఆస్ట్రేలియా	7	5	2	10	0.924
న్యూజిలాండ్	8	4	4	8	0.398
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	7	4	3	8	-0.330
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	8	2	6	4	-1.160
నెదర్లాండ్స్	7	2	5	4	-1.398
ఇంగ్లండ్	7	1	6	2	-1.504

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X అఫ్గానిస్తాన్
వేదిక: ముంబై
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

పంజాబ్ ఎట్టకేలకు...

మొహాలి: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పంజాబ్ జట్టు తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. బరోడా జట్టుతో జరిగిన ఫైనల్లో పంజాబ్ 20 పరుగుల తేడాతో గెలిచింది. గతంలో పంజాబ్ నాలుగుసార్లు (2007, 2012, 2013, 2015) పంజాబ్ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 223 పరుగులు సాధించింది. అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (61 బంతుల్లో 113; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు సెంచరీ చేశాడు. అనంతరం బరోడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 203 పరుగులు చేసి ఓడిపోయింది. బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ (4/23) పంజాబ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

వెర్‌స్టాపెన్‌కు 17వ విజయం

బ్రెజిల్ గ్రాండ్‌ప్రి టైటిల్ సొంతం



సావోపాలో (బ్రెజిల్): మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో 17వ విజయాన్ని నమోదు చేశాడు. సీజన్‌లోని 20వ రేసు బ్రెజిల్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును 'పోల్ పొజిషన్'తో ప్రారంభించిన అతను చివరిదాకా తన ఆధిక్యాన్ని కాపాడుకొని విజేతగా నిలిచాడు. వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక గంట 56 నిమిషాల 48.894 సెకన్లలో రేసును ముగించి టైటిల్ దక్కించుకున్నాడు. మొత్తం 20 మంది డ్రైవర్లలో 14 మంది మాత్రమే రేసును పూర్తి చేశారు. ఈ ఏడాది మొత్తం 22 రేసులు ఉండగా.. ఇప్పటికి 20 రేసులు ముగిశాయి. 17 రేసుల్లో వెర్‌స్టాపెన్ నెగ్గగా... రెండు రేసుల్లో సెర్జియో పెరెజ్ (రెడ్‌బుల్), ఒక రేసులో కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) గెలిచారు. ఈ సీజన్‌లోని తదుపరి రేసు లాస్‌వేగస్ గ్రాండ్‌ప్రి ఈనెల 19న జరుగుతుంది.

ఫైనల్లో స్వియాటెక్



కాన్‌కున్ (మెక్సికో): మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) ఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన రెండో సెమీఫైనల్లో స్వియాటెక్ 6-3, 6-2తో ప్రపంచ నంబర్‌వన్, గత ఏడాది రన్నరప్ సబలెంకా (బెలారస్)పై గెలిచింది. ఐదో ర్యాంకర్ జెస్సికా పెగూలా (అమెరికా)తో జరిగే ఫైనల్లో స్వియాటెక్ గెలిచి విజేతగా నిలిస్తే మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంటుంది.

సినిమా

కనిపించడు.. వ్యాపించి ఉంటాడు!


రవితేజ

''కొండలో లావాని కిందకి పిలవకు... ఊరు ఉండదు.. నీ ఉనికి ఉండదు'' అంటూ రవితేజ వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది 'ఈగల్' సినిమా టీజర్. రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రం ఇది. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. ''ఎక్కడుంటాడు?(అనుపమా పరమేశ్వరన్).. అడవిలో ఉంటాడు.. నీడై తిరుగుతుంటాడు.. కనిపించడు. కానీ వ్యాపించి ఉంటాడు ('అవసరాల' శ్రీనివాస్) వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: దావ్ జాంద్, సహ-నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

అనుష్క @ 50


అనుష్క

'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వంటి హిట్ మూవీ తర్వాత అనుష్క నటించనున్న తెలుగు చిత్రం ఏంటి? అనే ప్రశ్నకు సోమవారం సమాధానం దొరికింది. నేడు (నవంబర్ 7) అనుష్క పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమె నటించనున్న తాజా సినిమా ప్రకటన వచ్చింది. అనుష్క లీడ్ రోల్‌లో జి.అశోక్ దర్శకత్వంలో 'భాగమతి'ని నిర్మించిన యూవీ క్రియేషన్స్ అధినేతలు వంశీ, ప్రమోద్ తాజాగా 'భాగమతి 2'ని ప్రకటించారు. అనుష్క నటించనున్న 50వ చిత్రం ఇది. ఇక 'భాగమతి' చిత్రం 2018 జనవరి 26న విడుదలై, మంచి విజయం సాధించిన విషయం తెలిసిందే. దాదాపు ఆరేళ్లకి 'భాగమతి 2' సినిమా ప్రకటించారు వంశీ, ప్రమోద్. ఈ సినిమాని భారీ స్థాయిలో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ చిత్ర దర్శకుడు, నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు. కాగా అనుష్క నటించిన తాజా మలయాళ చిత్రం 'కథనార్' విడుదలకు సిద్ధమవుతోంది.

రంగరాయ శక్తివేల్ నాయకర్.. థగ్‌లైఫ్


కమల్ హాసన్

'నాయగన్'(1987) చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రానికి 'థగ్ లైఫ్' టైటిల్‌ని ఖరారు చేసి, టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను సోమవారం రిలీజ్ చేశారు మేకర్స్. అలాగే ఈ చిత్రంలో త్రిష, దుల్కర్ సల్మాన్, 'జయం' రవి కీలక పాత్రలు పోషించనున్నట్లు కూడా వెల్లడించారు. 'రంగరాయ శక్తివేల్ నాయకర్.. నాది కాయల్ పట్టినమ్', 'రంగరాయ శక్తివేల్ నాయకర్ అంటే క్రిమినల్, గూండా, యాకుజా. యాకుజా అంటే జపనీస్‌లో గ్యాంగ్‌స్టర్ అని అర్థం', 'చావు నా కోసం ఎదురుచూడటం ఇదేం తొలిసారి కాదు. చివరిసారి కూడా కాదు', 'నా పేరు రంగరాయ శక్తివేల్ నాయకర్.. మర్చిపోవద్దు' అని కమల్‌హాసన్ చెప్పే డైలాగ్స్ 'థగ్స్ లైఫ్' టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోలో ఉన్నాయి. కమల్‌హాసన్, మణిరత్నం, ఆర్ మహేంద్రన్, శివ అనంత్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నేడు కమల్ బర్త్ డే సందర్భంగా 'థగ్ లైఫ్'కి సంబంధించిన విశేషాలను సోమవారం వెల్లడించారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమెరా: రవి కె.చంద్రన్.

నన్ను కొత్తగా చూస్తారు

- రాఘవా లారెన్స్

రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'జిగర్ తండ డబుల్ ఎక్స్'. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో కార్తికేయన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో చెప్పిన విశేషాలు.


ఎస్‌జే సూర్య, రాఘవా లారెన్స్

లారెన్స్ మాట్లాడుతూ – ''జిగర్ తండ' సినిమాలోని గ్యాంగ్‌స్టర్ పాత్రలో నటించే తొలి అవకాశం నాకే వచ్చింది. కానీ అప్పుడు ఇతర ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉండటం వల్ల చేయడం కుదర్లేదు. ఆ తర్వాత 'జిగర్ తండ'కు రెండు జాతీయ అవార్డులు వచ్చాయి. దీంతో 'జిగర్ తండ' కు సీక్వెల్ ఉన్నట్లయితే అందులో నేను నటిస్తానని కార్తీక్ సుబ్బరాజుకి చెప్పాను. ఈ సీక్వెల్ 'జిగర్ తండ: డబుల్ ఎక్స్' కథ సిద్ధమైన ఏడాది తర్వాత కార్తీక్ సుబ్బరాజు ఫోన్ చేసి చెప్పారు. కథ నచ్చడంతో ఈ సినిమాలో నటించాను. ● ఈ సినిమా విషయంలో దర్శకుడు కార్తీక్ చెప్పినట్లు చేశాను. ప్రేక్షకులు కొత్త రాఘవా లారెన్స్‌ని చూస్తారు. సినిమా ఫస్టాఫ్‌లో యాక్షన్, సెకండాఫ్‌లో భావోద్వేగాల సన్నివేశాలు ఉంటాయి. ముఖ్యంగా చివరి 20 నిమిషాలు ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా ఉంటుంది. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకుల హృదయం కూడా బరువెక్కుతుంది. ● త్వరలో 'కాంచన 4' స్టార్ట్ చేస్తాను. ఇక సూపర్ స్టార్ రజనీకాంత్‌గారి కోసమే కాదు.. సూపర్ స్టార్, మెగాస్టార్ (చిరంజీవిని ఉద్దేశిస్తూ..) కలిసి యాక్ట్ చేసే ఓ మల్టీస్టారర్ స్క్రిప్ట్ నా దగ్గర ఉంది. కానీ వారు యాక్ట్ చేయాలి కదా'' అన్నారు.

నటుడు- దర్శకుడు ఎస్‌జే సూర్య మాట్లాడుతూ- ''దర్శకత్వం-నటన..ఈ రెండింటిలో నాకు నటన అంటేనే ఇష్టం. అయితే నా కెరీర్ ప్రారంభంలో యాక్టింగ్ అవకాశాల కోసం డైరెక్షన్‌ని వారధిగా వినియోగించుకున్నాను. ఇక 'జిగర్ తండ: డబుల్‌ఎక్స్'లో లారెన్స్‌గారిది గ్యాంగ్‌స్టర్ రోల్. నాదేమో దర్శకుడు కావాలనుకునే పాత్ర. నా పాత్రలో సత్యజిత్ రేగారి సినిమాల రిఫరెన్స్ ఉండటంతో ఇదొక బహుమతిగా భావించి ఈ మూవీ చేశాను. మంచి మాస్ కమర్షియల్ అంశాలు ఉన్న సందేశాత్మక చిత్రం ఇది. ఈ సినిమా షూటింగ్ కోసం ఓ విలేజ్ సెట్ వేయాల్సి వచ్చింది. ఇందులో భాగంగా ఓ రోడ్, బ్రిడ్జ్ వేశాం. అప్పటికే రోడ్, బ్రిడ్జ్ సౌకర్యాలు లేక ఇబ్బందిపడుతున్న ఆ గ్రామస్తులకు ఇవి ఇప్పుడు ఉపయోగపడుతున్నాయి. నేను నటిస్తూ, నా దర్శకత్వంలో ఓ సినిమా రానుంది'' అని చెప్పుకొచ్చారు.


● బన్నీ వాసు, తేజా మార్ని, అల్లు అరవింద్, అనిల్ రావిపూడి, శివానీ, రాహుల్ విజయ్, విద్య

ఈ కథ చాలా సంతృప్తినిచ్చింది

- నిర్మాత అల్లు అరవింద్

రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ లీడ్ రోల్స్‌లో శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కి దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత అల్లు అరవింద్ అతిథులుగా హాజరయ్యారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''పోలీసులను రాజకీయ నాయకులు ఏ విధంగా వాడుకున్నారనే అంశంపై ఈ సినిమా ఉంటుంది. చాలా సంతృప్తినిచ్చిన కథ ఇది. పోలీసులు పడే బాధలు, ఇబ్బందులు ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు. ''ఈ సినిమా ఒరిజినల్ (మలయాళ చిత్రం 'నాయట్టు') చూశాను. 'కోట బొమ్మాళి'లో చాలా మార్పులు చేశారు. టీజర్ చాలా ఆసక్తిగా ఉంది. ఇప్పుడు నిర్మాతగా వస్తున్న విద్యాగారు సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు అనిల్ రావిపూడి. ''తేజా మార్ని డైరెక్షన్, కాశీ నాగేంద్ర డైలాగ్స్ ప్రేక్షకులను ఆలోచింపజేస్తాయి. సిటీల్లో జరిగే ఎన్నికల గురించి నాకు పెద్దగా తెలియదు. ఊర్లలో ఉన్న, అక్కడి ఎలక్షన్స్‌లో పాల్గొంటున్న వారికి ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు గట్టిగా తగుల్తాయి. కొంతమంది రాజకీయ నాయకులకు కూడా తగలొచ్చు. ఏ పార్టీకీ కొమ్ము కాసేలా ఈ సినిమా ఉండదు'' అన్నారు 'బన్నీ' వాసు. ''నేరస్తులను పట్టుకోవాల్సిన పోలీసులే ఓ కేసులో ఇరుక్కుని ఎలా అవస్థలు పడ్డారనేది ఈ సినిమా కాన్సెప్ట్'' అన్నారు తేజా మార్ని. ''ఈ సినిమా కోసం అందరూ చాలా కష్టపడ్డారు'' అన్నారు విద్యా. ఈ కార్యక్రమంలో చిత్ర కో ప్రొడ్యూసర్స్ భాను-రియాజ్, రైటర్ కాశీ నాగేంద్ర, ఆర్ట్ డైరెక్టర్ గాంధీ, నిర్మాతలు ధీరజ్, వంశీ నందిపాటి, ఎస్‌కేఎన్ పాల్గొన్నారు.

ఈ విజయం కొత్తగా ఉంది

- నిర్మాత గౌరీకృష్ణ


గౌరీకృష్ణ

''నేను గతంలో పలు సినిమాలు నిర్మించినా అనుకున్నంత విజయం సాధించలేదు. 'మా ఊరి పొలిమేర 2' చిత్రంతో తొలి హిట్ అందుకున్నా.. ఈ విజయం చాలా కొత్తగా ఉంది. మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అని నిర్మాత గౌరీకృష్ణ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల జంటగా డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా గౌరీకృష్ణ మాట్లాడుతూ– ''మా ఊరి పొలిమేర' తొలి భాగం విజయం సాధించిందని సీక్వెల్ తీయలేదు. అనిల్ విశ్వనాథ్‌పై నమ్మకంతోనే 'మా ఊరి పొలిమేర 2' తీశాం. గీతా ఆర్ట్స్ సంస్థకు చెందిన వంశీ నందిపాటిగారు విడుదల చేయడం వల్ల సినిమాకు ప్లస్ అయ్యింది. నిర్మాతగా నా తర్వాతి చిత్రానికి కథా చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.

అన్నదమ్ముల అనుబంధం


● సంపూర్ణేష్ బాబు, సంజోష్

సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీ బన్సాల్, ఆర్తీ గుప్తా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సోదరా'. మన్‌మోహన్ మేనంపల్లి దర్శకత్వం వహించారు. చంద్ర చంగళ్ల నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నిర్మాత వివేక్ కూచిభొట్ల రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ– ''అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో వినోదాత్మకంగా 'సోదరా'ను రూపొందించాం. ఇటీవలే విడుదలైన మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమాని త్వరలోనే విడుదల చేయనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: జాన్.

ఇది మనందరి కథ

- దర్శకుడు మారేష్ శివన్



''ప్రేమ, లక్ష్యం.. ఈ రెండింటినీ ఒకేసారి ఎంచుకోవాల్సి వస్తే ఏం చేస్తారు? ఏం చేయాలి? అనే సందేశంతో 'అలా నిన్ను చేరి' సినిమా తీశా. ప్రతి మనిషిలో జరిగే కథ ఇది. యువతరంతో పాటు కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం ఇది. మా చిత్రాన్ని చూసిన తర్వాత కొంత మందైనా మారతారనే నమ్మకం ఉంది'' అని దర్శకుడు మారేష్ శివన్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలవుతోంది. మారేష్ శివన్ విలేకరులతో మాట్లాడుతూ-''ఈ చిత్ర కథ 2012 నేపథ్యంలో జరుగుతుంది. 2012లో రాసుకున్న కథే అయినా ఇందులోని ప్రేమ, భావోద్వేగాలు ఇప్పటి వారికి కూడా నచ్చుతాయి. సుభాష్ ఆనంద్ సంగీతం ఓ ప్లస్. ఈ సినిమా ప్రీమియర్ చూసిన డైరెక్టర్ త్రినాథరావు, నిర్మాతలు బెక్కెం వేణుగోపాల్, బెల్లంకొండ సురేష్‌వంటి వారు మంచి సినిమా తీశానని అభినందించారు. ప్రేక్షకులు థియేటర్స్ నుంచి అదే భావోద్వేగంతో బయటికొస్తారు'' అన్నారు.